# 'పోడు' సమస్యను పరిష్కరించిన సీఎం కేసీఆర్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియానాయక్, పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే హరిప్రియ, జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు

**ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్**

బయ్యారం, నవంబర్ 2: దశాబ్దాల కాలంగా ఉన్న పోడు సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కరించారని, బీఆర్ఎస్‌తోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్ అన్నారు. గురువారం బయ్యారం మం డలంలోని ఇసుకమేది, మిర్యాలపెంట, నారాయణపురం, లక్ష్మీపురం, కంబాలపల్లి, కొయగూడెం గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందుతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులను నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులు దశాబ్ధాలుగా ఉన్న పోడు సమస్యకు ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కరించి ఇల్లెందు నియెజకవర్గంలోని 48వేల ఎకరాలకు పోడు పట్టాలు అందించి దాంతోపాటు రైతుబంధు, రైతుబీమా కల్పించారని పేర్కొన్నారు. తండాలను పంచాయతీలుగా చేశారని, గిరిజన సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలోనే సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. త్వరగా జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయ కేతనం ఎగుర వేస్తుందని, కేసీఆర్ మూడోవసారి సీఎంగా ఉంటారన్నారు. అభివృద్ధికి కేరాఫ్‌గా మారిన బీఆర్ఎస్ అభ్యర్థులను, అత్యధిక మెజార్టితో గెలిపించాలని కోరారు.

**బీఆర్ఎస్‌లో పలువురు చేరిక...**

బయ్యారం మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు పోడుగు సుగుణ, ఉప సర్పంచ్ సనప నరేశ్, వార్డు సభ్యురాలు యశోద, నాయకులు ప్రసాద్, వెంకటేశ్ , సుధాకర్, నరేశ్ బీఆర్ఎస్‌లో చేరడంతో వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాత గణేశ్ , పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బానోత్ మురళీకృష్ణ, ఆత్మ కమిటీ జిల్లా సభ్యుడు ఏనుగుల ఐలయ్య, బానోత్ శ్రీను నాయక్ , యూత్ అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్ నాయక్ , ఆర్వీ , కృష్ణ , వెంకటపతి పాల్గొన్నారు.

# సింగరేణీయులంటే కేసీఆర్‌కు ఎనలేని ప్రేమ

- టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత
- హాజరైన ప్రభుత్వ విప్ రేగా, టీబీజీకేఎస్ నేతలు వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డి



మణుగూరు టౌన్, నవంబర్ 2: సింగరేణి సంస్థ అంటే ముఖ్యమంత్రి కేసీఆర్ అని, కేసీఆర్ అంటే సింగరేణి సంస్థ అని సింగరేణి కార్మికులు చెప్పుకుంటున్నారని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీ.వెంకట్రావు, జనరల్ సెక్రెటరీ మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. సింగరేణీయులంటే సీఎం కేసీఆర్‌కు ఎనలేని ప్రేమాభిమానలు ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు అధ్యక్షతన మణుగూరు ఏరియా పీవీకాలనీలో గురువారం నిర్వహించిన టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత సింగరేణి సంస్థలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధికి కార్మికలోకమంతా ఆయనకు అండగా నిలుస్తుందని అన్నారు. సింగరేణి కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు ఇచ్చారని, సుమారు 15 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని అన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో కేసీఆర్ విజయం, పినపాకలో రేగా గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. సింగరేణీయులందరూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. రేగాను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు కారు గుర్తుపై ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తే సింగరేణీయుల జీవితాలు మరింత మెరుగుపడతాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, కాపా శివాజీ, ఎస్‌వీఎస్ఎన్ వర్మ, సీహెచ్‌వీ.రెడ్డి, బానోత్ కృష్ణ, అశోక్, అన్ని గనులు, డిపార్టుమెంట్ల ఫిట్ సెక్రెటరీలు, ఫిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆత్మల శాంతి కోసమే సమాధుల పండుగ

టేకులపల్లి, నవంబర్ 2: క్రైస్తవులు తమ కుటుంబంలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని సమాధుల వద్ద చేసే ప్రార్థనలను సమాధుల పండుగ అని సులానగర్ ఆర్‌సీఎం పెద్ద చర్చి ఫాదర్ తూంపాటి ఆగస్టీన్ అన్నారు. గురువారం మండలంలోని కోయగూడెం గ్రామంలో ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ఆగస్టీన్ ఆధ్వర్యంలో సమాధుల పండుగను పూరస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవుల సమాధుల వద్దకు వెళ్లి సమాధులపై పూలు ఉంచి, కొవ్వొత్తులు వెలిగించి, వారి ఆత్మల శాంతి కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం సులానగర్, మాలపల్లి, మూత్యాలంపాడు గ్రామాల్లో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘస్తులు వేముల రాంపండు, రామ్మూర్తి, కణతల కోటయ్య, పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

**ఇల్లెందు రూరల్‌లో..**

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: క్రైస్తవులు సమాధుల పండుగను నిర్వహించారు. గురువారం కొత్తబస్టాండ్ ఏరియాలోని సమాధుల వద్ద చనిపోయిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేసి కొవ్వొత్తులను వెలిగించారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ ఫ్రాంక్లిన్ ప్రతీ సమాధి వద్దకెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ప్రతీ సంవత్సరం నవంబర్ 2న సమస్త ఆత్మల రోజుగా క్రైస్తవులు పండుగలు జరుపుకుంటారు. సీఎస్ఐ చర్చి కమిటీ ట్రెజరర్ కంచి జయరాజు, జేకే చర్చి పాస్టర్ రెవరెండ్ స్పందన, చర్చి కమిటీ సభ్యులు అబ్బూరి సునీల్, అశోక్, కొచ్చర్ల ప్రభాకర్, గండ్రాతి భాస్కర్, క్రైస్తవులు పాల్గొన్నారు.




టేకులపల్లి: కోయగూడెంలోని సమాధుల వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు, ఇల్లెందు రూరల్‌లో..

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కిరణ్



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేగా కాంతారావు

మణుగూరుటౌన్, నవంబర్ 2: కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల ఉపాధ్యక్షుడు బూర్గుల కిరణ్‌మోహన్ గురువారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు సమక్షంలో చేరారు. ఆయనకు గులాబీ కండువాకప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ చేరే విధంగా ఇంటింటికెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరు కారు గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీ సాధించే విధంగా ప్రతిఒక్కరు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్కా మధుసూదన్, నేలటూరి సతీష్‌రాజ్, పొడుగంటి సునీల్, సోషల్‌మీడియా నాయకులు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

**రిటర్నింగ్ అధికారి జే కాశయ్య**



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కాశయ్య

ఇల్లెందు రూరల్, నవంబర్ 2: శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని రిటర్నింగ్ అధికారి జే కాశయ్య అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీఆర్ఎస్, సీపీఐ, బీఎస్పీ, టీడీపీ తదితర పార్టీల నాయకులకు నామినేషన్ల స్వీకరణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్లు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారన్నారు. నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులను సమాయత్తం చేశామన్నారు. నామినేషన్ టీం, నామినేషన్ హెల్ప్ డెస్క్ కౌంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏ విధంగా నామినేషన్ వేయాలో వారికి అవగాహన కల్పించారు. ఇల్లెందు, గార్ల, బయ్యారం, కామేపల్లి, టేకులపల్లిలో ఏర్పాట్లన్ని సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్, అధికారులు విజయ్, ముత్తయ్య, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ ఎంపికలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్ణశాల, నవంబర్ 2: ఈ నెల 1వ తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల అథ్లెటిక్స్ ఎంపికలో ప్రతిభ కనబరిచారు. మండలంలోని గౌరారం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు 1500 మీటర్ల పరుగులో కుంజా సమ్మక్క (10వ తరగతి), 800 మీటర్లలో మడకం జైష్ణవి, బుద్దుల అనూష (9వ తరగతి) ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. వీరు హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెళ్లనున్నారు. విద్యార్థినులను హెచ్‌ఎం సుజాత, బీ నాగేశ్వరరావు, కే నాగేశ్వరరావు, అనసూయ, మూర్తి, పాఠశాల సిబ్బంది వెంకటేశ్వరరావు, పీడీ వెంకటేశ్, తోటి విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.